# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్ 27.05.2025 | 24 క్యారెట్లు 89,787.00 | కిలో వెండి 1,07,657.00 | 32 ℃ | సంపుటి:3 | సంచిక:206

www.vishalabharati.com


## మిల్లా మాగీ ఆరోపణలు నిరాధారం

- మాగీ ఆరోపణలపై నిర్వాహకులు యూకేలో విచారణ
- మిస్ వరల్డ్ నిర్వహణ పట్ల పోటీదారులు సంతృప్తి
- ఇతర పోటీదారులెవరు ఇబ్బందీ ఎదురుకాలేదని అన్నారు
- పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

72వ మిస్ వరల్డ్ పోటీలపై వస్తున్న ఆరోపణలను పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తోసిపుచ్చారు. మిస్ ఇంగ్లండ్ వ్యాఖ్యలను ప్రచురించిన టాబ్లెయిడ్‌కు అంతగా ప్రాముఖ్యత లేదన్న ఆయన, అయినప్పటికీ నిజాలను తెలుసుకునేందుకు పోటీదారులతో మాట్లాడినట్లుగా వివరణ ఇచ్చారు. మిస్ వరల్డ్ నిర్వహణ పట్ల పోటీదారులు సంతృప్తి వ్యక్తం చేశారని వివరించారు. మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని జయేశ్‌రంజన్ అన్నారు. ఈ వివాదంపై స్పందించారు. 'మిల్లా మాగీ ఇక్కడ ఉన్నది 8 రోజులు మాత్రమేనని విరించారు. ఆమె ఆరోపణలపై ఇతర పోటీదారులతో తాను మాట్లాడగా వారెవరూ తమకెలాంటి

..మిగతా 2 లో

## ద్రోహుల వల్లే నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్

- ఆయన టీమ్‌లో ఉన్న ఆరుగురు ఇటీవలే లొంగుబాటు
- వారు ఇచ్చిన సమాచారంతోనే ఎన్‌కౌంటర్
- 20 వేల మంది బలగాలతో 35 మంది 60 గంటల పాటు పోరాటం
- 6 నెలలుగా మాడ్ ప్రాంతంలోనే నంబాల
- సురక్షిత ప్రాంతానికి తరలిస్తామంటే ఆయన ఒప్పుకోలేదు
- ఆయన కోసం 35మంది ప్రాణాలు అడ్డుపెడితే
- 7గురు బయటపడ్డారు, 28 మంది అమరులయ్యారు
- బసవరాజ్ స్మృతిలో ప్రపంచ వ్యాప్తంగా సంస్మరణ సభలు నిర్వహించాలని పిలుపు
- మావోయిస్టు స్పెషల్ జోనల్ కమిటీ వికల్ప్



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ద్రోహులు ఇచ్చిన సమాచారంతోనే మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు అలియాస్ బిఆర్ దాదా హత్య జరిగిందని ఆ పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రకటించింది. కేశవరావు భద్రతలో ప్రధాన పాత్ర పోషించిన వ్యక్తులు పోలీసులకు లొంగిపోయి ఆయన సమాచారాన్ని అందించారని ఆరోపించారు. కేశవరావుతో పాటు ఉన్న 35

..మిగతా 2 లో

# కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు

## ఈనెల 28న ఫార్ములా ఈ కేసులో విచారణకు హాజరుకావాలని నోటీసులు



- నెలాఖరులో అమెరికా, యూకే పర్యటన షెడ్యూల్ ఖరారు
- చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా విచారణకు సహకరిస్తా
- ఏసీబీకి లిఖితపూర్వక సమాచారమిచ్చిన కేటీఆర్
- రేవంత్ రెడ్డి నాయకుడిగా, పాలకుడిగా విఫలం
- రాజకీయ వేధింపుల్లో భాగంగానే నోటీసులు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- వైఫల్యాలను కప్పిపుచ్చుకోడానికే నోటీసులు
- సోషల్ మీడియా వేదికగా ఎమ్మెల్సీ కవిత
- రేవంత్ రెడ్డి కుటిల రాజకీయ క్రీడలో భాగంగానే నోటీసులు
- కల్పిత కేసులు న్యాయస్థానాల్లో నిలువవు.
- మాజీ మంత్రి హరీష్ రావు

*మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు నోటీసులు జారీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఫార్ములా ఈ- కేసులో ఈ నెల 28న విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే, నెలాఖరులో అమెరికా, యూకే పర్యటన షెడ్యూల్ ఇప్పటికే ఖరారైనందున తిరిగి వచ్చిన తరువాత హాజరవుతానని, చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా విచారణకు సహకరిస్తానని, ఫార్ములా ఈ కేసుపై ఏసీబీకి లిఖితపూర్వక సమాచారమిచ్చా కేటీఆర్ తెలిపారు.*

**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**

గతంలో ఇదే కేసులో కేటీఆర్ను ఏసీబీ విచారించిన విషయం తెలిసిందే. రాజకీయ వేధింపుల్లో భాగంగానే నోటీసులు ఇచ్చారని, రాజకీయ కక్ష కోసం తహతహలాడుతున్నాడని కేటీఆర్ విమర్శించారు. 48 గంటల క్రితం ఈడీ ఛార్జిషీట్‌లో సీఎం రేవంత్ పేరు వచ్చిందని, 24 గంటల క్రితమే ప్రధాని మోదీ

..మిగతా 2 లో

## దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ

### ఇబ్బందుల్లో 140 కోట్ల దేశ ప్రజలు.. మోదీ 'అచ్చే దిన్' వాగ్దానం పీడకల

- 11ఏళ్లలో ఇచ్చిన వాగ్దానాలేవి అమలు చేయలేదు
- నిరుద్యోగం పెరిగిపోయింది
- ప్రజాస్వామ్యంపై ఆర్ఎస్ఎస్ దాడి చేస్తోంది
- కేంద్ర సంస్థల స్వయంప్రతిపత్తి నాశనమైంది
- కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే



**-విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కేంద్రంలో మోదీ సర్కార్ అధికారంలోకి వచ్చి మే26 నాటికి 11 ఏళ్లు పూర్తైన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. అప్రకటిత అత్యవసర పరిస్థితి 11ఏళ్లు పూర్తి చేసుకుందని ఎద్దేవా చేసింది. మోదీ 'అచ్చే దిన్' వాగ్దానం పీడకలగా మిగిలిపోయిందని విమర్శించింది. గత 11ఏళ్లుగా 140 కోట్ల మంది ప్రజలు మోదీ పాలన వల్ల ఇబ్బంది పడుతున్నారని కాంగ్రెస్ చీఫ్

..మిగతా 2 లో

## కార్మికులకు రూ.కోటి ప్రమాద బీమా

- ఇది దేశ చరిత్రలోనే రికార్డు
- బాధిత కుటుంబీకులకు చెక్కు అందజేత
- కారుణ్య నియామకపత్రం సైతం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**విశాల భారతి,స్టేట్ బ్యూరో:**

విద్యుత్ కార్మికులకు రూ.కోటి పైబడి ప్రమాద బీమా అందించడం దేశ చరిత్రలోనే ఒక రికార్డు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ప్రజాభవన్‌లో సోమవారం ఉదయం ఎస్పీడీసీఎల్ పరిధిలో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన జోగు నరేశ్ కుటుంబ సభ్యులకు రూ.కోటి రూపాయల ప్రమాద బీమా చెక్కుతో పాటు నరేశ్ శ్రీమతికి విద్యుత్ శాఖలో కారుణ్య నియామక ఉత్తర్వులు

..మిగతా 2 లో



## సర్కార్ బడిపై నమ్మకం పెరిగేలా పనిచేయండి

- విద్యాప్రమాణాల మెరుగుకు కృషిచేయండి
- స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి

2 లో

## రానున్న 4 రోజులు భారీ వర్షా లు

- రాష్ట్రంలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు
- అంచనా సమయం కంటే ముందుగానే ప్రవేశం
- పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ
- వర్షా ల సమయంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి
- వాతావరణ శాఖ



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయని వాతావరణ శాఖ వెల్లడించింది. అంచనా వేసిన సమయం కంటే ముందుగానే వచ్చినట్లు తెలిపింది. ఉత్తర తెలంగాణపై ద్రోణి ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో

..మిగతా 2 లో

## జ్యోతి మల్హోత్రాకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ

- గూఢచర్యానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై అరెస్టయిన యూట్యూబర్
- జ్యోతి మొబైల్ కాల్ వివరాలు తొలగించినట్లుగా పోలీసుల నివేదిక
- పాకిస్తాన్ పర్యటనలో అక్కడి అధికారులు రాచమర్యాదలు
- ఆమెకు ఆరుగురు గన్‌మెన్లు ఏకే 47తో భద్రత



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

పాకిస్తాన్ కోసం గూఢచర్యానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై అరెస్టయిన యూట్యూబర్ జ్యోతిని పోలీసులు హిసార్ కోర్టుకు తరలించారు. సివిల్ జడ్జి సునీల్ కుమార్ కోర్టులో జ్యోతి మల్హోత్రాను హాజరుపరుచగా.. న్యాయమూర్తి ఆమెకు

..మిగతా 2 లో

## రాజ్యసభకు కమల్ హాసన్

- ఒప్పందం ప్రకారం డీఎంకే మద్దతు
- త్వరలోనే అధికారిక ప్రకటన
- ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన ఈసీ
- జులై 24 నాటికి ఖాళీ కానున్న 6 రాజ్యసభ స్థానాలు
- జూన్ 2న నామినేషన్లు, 19న ఎన్నికలు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మక్కల్ నీతి మయ్యం పార్టీ అధినేత, ప్రముఖ నటుడు కమల్ హాసన్ రాజ్యసభ ఎంపీ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో డీఎంకే, మక్కల్ నీతి మయ్యం పార్టీల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం కమల్ హాసన్‌కు రాజ్యసభ స్థానాన్ని కేటాయించనున్నట్లు తెలుస్తోంది. అయితే, రాజ్యసభ ఎంపీగా ఎన్నిక కావాలంటే కనీసం 34 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. తమిళనాడు

..మిగతా 2 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం,
27.05.2025
హైదరాబాద్
epaper:vishalabharathi.com
www.vishalabharathi.com



## ప్రజావాణికి 36 ఫిర్యాదులు

నారాయణపేట,విశాలభారతి:

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. ప్రజావాణి సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 36 ఫిర్యాదులు అందాయి.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, జడ్.పి.సి.ఈ.ఓ శైలేష్ కుమార్ కు అందజేశారు. ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ,సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఎ.ఓ జయసుధ,డీ ఆర్ డీ వో మొగులప్ప,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు

తరువాయి భాగం

సహా బీజేపీ అగ్రనేతలను రేవంత్ కలిశారని అన్నారు. సోమవారం తనకు ఏసీబీ నుంచి నోటీసులు వచ్చాయని, మనీలాండరింగ్‌లో రేవంత్ ప్రమేయంపై బీజేపీ నుంచి ఒక్క మాట కూడా లేదని, రేవంత్ నాయకుడిగా, పాలకుడిగా విఫలం అయ్యారని తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌కు ఏసీబీ నోటీసులు జారీ చేయడంపై బీఆర్ఎస్ నేతలు హరీష్‌రావు, కవిత ప్రభుత్వంపై మండిపడ్డారు. వైఫల్యాలను కప్పిపుచ్చుకోడానికి, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికి కుట్రపూరితంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసిందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. ఫార్ములా ఈ కేసులో ఈ నెల 28న విచారణకు రావాలని ఏసీబీ నోటీసులు జారీ చేసిందని కేటీఆర్ తెలిపారు. ఏసీబీ నోటీసులు జారీ చేయడాన్ని సోషల్ మీడియా వేదికగా కవిత ఖండించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటిల రాజకీయ క్రీడలో భాగంగానే ఏసీబీ నోటీసులు జారీ చేసినట్లు స్పష్టమవుతోందన్నారు. తమ పార్టీ నాయకులకు వరుస నోటీసులు జారీ చేయడం వెనుక రాజకీయ దురుద్దేశం ఉన్నట్లు తేటతెల్లమైందని.. ఎవరెన్ని ఇబ్బందులు పెట్టాలని ప్రయత్నించినా తట్టుకొని నిలబడ్డ చరిత్ర కేసీఆర్ సైనికులదని స్పష్టం చేశారు. ఏసీబీ నోటీసులపై మాజీ మంత్రి హరీశ్‌రావు సైతం స్పందించారు. ప్రతీకార రాజకీయాలు రేవంత్‌రెడ్డి అభద్రతా భావానికి స్పష్టమైన సంకేతాలని.. కల్పిత కేసులు న్యాయస్థానాల్లో నిలువవు.. ప్రజామోదాన్ని పొందవని హరీశ్‌రావు పేర్కొన్నారు. కేటీఆర్‌కు అండగా నిలుస్తామని.. అంతిమంగా సత్యే గెలుస్తుందని హరీశ్‌రావు ట్వీట్ చేశారు.

# దేశంలో 'అప్రకటిత ఎమర్జెన్సీ

తరువాయి భాగం

మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. "గత 11ఏళ్లలో ఇచ్చిన వాగ్దానాలేవి మోదీ సర్కార్ అమలు చేయలేదు. దేశాన్ని నాశనం చేసింది. 'అచ్ఛే దిన్' అనే వాగ్దానం ఇప్పుడు 'పీడకల'గా మారిపోయింది. యువతకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాల హామీ నెరవేర్చలేదు. వాస్తవానికి కోట్లాది ఉద్యోగాలు పోయాయి. రైతులు ఆదాయం రెట్టింపు కాలేదు. పైగా రైతులు రబ్బరు బుల్లెట్లను ఎదుర్కోవలసి వచ్చింది. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు అమలు కాలేదు. వారికి దేశంలో భద్రతే లేదు. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలపై భయంకరమైన దాడులు జరుగుతున్నాయి. ఆర్థిక వ్యవస్థ బాగాలేదు. ద్రవ్యోల్బణం గరిష్ట స్థాయికి చేరుకుంది. నిరుద్యోగం పెరిగిపోయింది." అని ఖర్గే ఎక్స్ పోస్టో పేర్కొన్నారు. దేశంలో వినియోగం స్తంభించిపోయింది. మేక్ ఇన్ ఇండియా విఫలమైంది. అసమానతలు పెరిగిపోయాయి. విశ్వగురుగా మారతానని మోదీ వాగ్దానం చేశారు. ఇప్పుడు ప్రతి దేశంతో సంబంధాలు దెబ్బతిన్నాయి. ప్రజాస్వామ్యంపై ఆర్ఎస్ఎస్ దాడి చేస్తోంది. దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐలను దుర్వినియోగం చేస్తున్నారు. కేంద్ర సంస్థల స్వయంప్రతిపత్తి నాశనమైంది. మోదీ సర్కార్ 11 ఏళ్ల పాలనలో దేశంలోని ప్రతి వర్గం ఇబ్బంది పడుతోంది" అని ఖర్గే తన పోస్ట్ లో ఆరోపించారు.

# డీఎస్పీ రవీందర్ రెడ్డికి ఘన సన్మానం

- కాంగ్రెస్ నేత కాట అధ్వర్యంలో ఆత్మీయ సన్మాన సభ
- ముఖ్య అతిథిగా పాల్గొన్న అడిషనల్ ఎస్పీ సంజీవ రావు
- భారీగా తరలివచ్చిన అభిమానులు, నేతలు





పటాన్ చెరు,విశాలభారతి

పటాన్ చెరు డీఎస్పీగా పని చేసి బదిలీ అయిన పైళ్ళ రవీందర్ రెడ్డికి ఘన సన్మానం లభించింది. కాంగ్రెస్ పార్టీ పటాన్ చెరు నియోజకవర్గ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ డీఎస్పీ రవీందర్ రెడ్డి కోసం రామచంద్రపురం పరిధిలోని శ్రీ కన్వెన్షన్ హాల్లో భారీగా ఆత్మీయ సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా అడిషనల్ ఎస్పీ సంజీవరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పటాన్ చెరు నియోజకవర్గంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో గతంలో ఎస్ఐ, సీఐగా పని చేసిన రవీందర్ రెడ్డి గత కొన్ని నెలల నుంచి డిఎస్పీగా సేవలందించారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులతో డిఎస్పి రవీందర్ రెడ్డికి సత్సంబంధాలు ఉన్నాయి..కాంగ్రెస్ నేత కాట శ్రీనివాస్ గౌడ్ భారీ ఎత్తున ఆత్మీయ సన్మాన సభ ఏర్పాటు చేసి డిఎస్పి రవీందర్ రెడ్డితో తనకున్న ఆత్మీయతను చాటుకున్నారు. తమ అభిమాన పోలీస్ అధికారికి వీడ్కోలు పలికేందుకు పటాన్ చెరు నియోజకవర్గంలోని నలుమూలల నుంచి ప్రజలు, పోలీస్ అధికారులు, వివిధ పార్టీల నాయకులు, అభిమానులు వందలాదిగా తరలిరావడంతో శ్రీ కన్వెన్షన్ కిక్కిరిసింది. ఈ సందర్భంగా డీఎస్పీ రవీందర్ రెడ్డి దంపతులకు కాట శ్రీనివాస్ గౌడ్ తన సతీమణి కాట సుధాతో కలిసి ఆయనకు గజమాలతో ఘనంగా సన్మానం చేశారు. సభకు వచ్చిన వారంతా గజమాలలు, పూలమాలలు వేసి జ్ఞాపికలను అందించి డీఎస్పీ రవీందర్ రెడ్డికి శాలువలతో ఘనంగా సత్కరించారు, ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ సంజీవరావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎస్ఐ, సీఐ, డీఎస్పీగా సేవలందించిన రవీందర్ రెడ్డి అందరి మన్ననలు పొందారని చెప్పారు. బదిలీపై వెళ్తున్న పోలీస్ అధికారి సన్మాన సభకు వందలాది మంది తరలివచ్చి ఆత్మీయత చాటుకోవడం గొప్ప విషయమన్నారు. సంఘటనలు జరిగిన వెంటనే స్పందించే అధికారుల్లో ఒక్కరు డీఎస్పీ రవీందర్ రెడ్డి అని ఆయన ప్రశంసించారు. కాంగ్రెస్ నేత కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ డీఎస్పీ రవీందర్ రెడ్డి అహంకారం లేకుండా అందరి అభిమానం సంపాదించిన వ్యక్తి అని కొనియాడారు. డీఎస్పీ రవీందర్ రెడ్డితో తనకు విడదీయరాని బంధం ఉన్నదన్నారు. భవిష్యత్తులో ఆయన ఉన్నత స్థానం సంపాదించి ప్రజలకు సేవలు అందించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జెరిపాటి జైపాల్, జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, బొంతపల్లి ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, బీరంగూడ గుట్ట ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్, నాయకులు కొల్లూరి శ్రీనివాస్ గౌడ్, వీ.చంద్రారెడ్డి, ఐఎన్టీయుసి నాయకులు రెహమాన్, కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, సుధాకర్ గౌడ్, శివానందం, నరేందర్ రెడ్డి, ఆదిత్య రెడ్డి, సుధాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఎడ్ల రమేష్, మున్నా, ఎండీఆర్ ఫౌండేషన్ కో ఫౌండర్ పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# సర్కార్ బడిపై నమ్మకం పెరిగేలా పనిచేయండి

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

గతం తో పోలిస్తే ప్రస్తుతం ప్రతి మండలానికి ఒక ఎంఈవో ఉన్నారని, ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరిగేలా ఎంఈవోల పనితీరు ఉండాలని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి స్పష్టంచేశారు. రాష్ట్రం లో ఉన్న 629 ఎంఈవోలను రెండు విడుతల్లో ఈనెల 26 నుంచి 28 వరకు, జూన్ 3 నుంచి 5వ తేదీ వరకు లీడర్ షిప్, మానిటరింగ్ అండ్ డిపార్ట్ మెంట్ యాక్టివిటీస్ పై మూడ్రోజుల రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఎంసీఆర్ హెచ్ఆర్డీలో నిర్వహించారు. అందులో భాగంగా మొదటి విడుతలో 17 జిల్లాల నుంచి వచ్చిన 304 ఎంఈవోలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి చీఫ్ గెస్ట్ గా నర్సింహారెడ్డి హాజరై మాట్లాడారు. టీచర్ ట్రైనింగ్స్ ను మండల స్థాయిలో బాగా నిర్వహించినందుకు ఎంఈవోలను అభినందించారు. క్షేత్ర స్థాయిలో పాఠశాలల అభివృద్ధికి ఎంఈవోలు చాలా కీలకమని పేర్కొన్నారు. ఎంఈవోలంతా పాఠశాలలను సందర్శించి విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం కోసం కృషి చేయాలని సూచించారు. బడిబాటలో ప్రతి ఎంఈవో ఒక ప్రత్యేక కార్యాచరణతో పనిచేసి ఆయా మండలాల్లోని విద్యార్థుల సంఖ్య పెంచేలా కృషి చేయాలని ఆదేశించారు.

# కార్మికులకు రూ.కోటి ప్రమాద బీమా

తరువాయి భాగం



అందజేశారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. విద్యుత్ కార్మికుడికి రూ.కోటి ప్రమాద బీమా చెక్కును అందించడం తమకే సాధ్యమని కొనియాడారు. గతంలో కార్మికుల కోసం ఏ ప్రభుత్వం ఇంత గొప్పగా ఆలోచన చేయలేదని పేర్కొన్నారు. కార్మికులకు ప్రమాద బీమా పథకాన్ని మొదట సింగరేణిలో ప్రవేశపెట్టి అనంతరం విద్యుత్ సంస్థల్లోనూ ఆచరణలోకి తీసుకువచ్చిన విషయాన్ని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. రూ.కోటి ప్రమాద బీమా విద్యుత్ సంస్థలో పనిచేసే కార్మికుల్లో భరోసా నింపుతుందన్నారు. ప్రభుత్వ ఆలోచనను సమర్థవంతంగా అమలు చేసిన ఎస్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డిని డిప్యూటీ సీఎం అభినందించారు. కా ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, విద్యుత్, బ్యాంకు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాజ్యసభకు కమల్ హాసన్

తరువాయి భాగం

అసెంబ్లీలో డీఎంకే పార్టీకి అద్భుత మెజారిటీ ఉంది. డీఎంకే ఎమ్మెల్యేల మద్దతుతో మక్కల్ నీతి మయ్యం పార్టీ అభ్యర్థి కమల్ హాసన్ రాజ్యసభకు ఎన్నికవడం ఖాయంగా కనిపిస్తోంది. ఇటీవలే మక్కల్ నీతి మయ్యం పార్టీ కార్యనిర్వాహక కమిటీ సమావేశం జరిగింది. డీఎంకే మద్దతుతో రాజ్యసభ ఎన్నికల్లో కమల్ హాసన్ పోటీ చేయడానికి అనుమతించే తీర్మానాన్ని ఈ మీటింగ్‌లో పార్టీ కార్యనిర్వాహకులు ఆమోదించారు. మక్కల్ నీతి మయ్యం పార్టీ తరఫున రాజ్యసభ అభ్యర్థిగా కమల్ హాసన్ పోటీపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

# మిల్లా మాగీ ఆరోపణలు నిరాధారం

తరువాయి భాగం

ఇబ్బందీ ఎదురుకాలేదని చెప్పారని వివరించారు. చౌమొహల్లా ప్యాలెస్‌లో మిస్ ఇంగ్లండ్, మిస్ వేల్స్ ఒకే టేబుల్‌పై ఉన్నారని ఆయన తెలిపారు. వారితోపాటు సీనియర్ అధికారి, ఆయన భార్య, కోడలు, మరో మహిళ కూర్చున్నారని అన్నారు. అక్కడ తమతో ఎవరూ తప్పుగా ప్రవర్తించలేదని మిస్ వేల్స్ స్పష్టం చేశారని జయేశ్ రంజన్ తెలిపారు. మాగీ ఆరోపణలపై మిస్‌వరల్డ్ నిర్వాహకులు యూకేలో విచారిస్తున్నారన్నారు. ఆమెను ఇంటర్వ్యూ చేసిన టాబ్లాయిడ్‌కు కూడా అంత ప్రాధాన్యం లేదని ఆయన స్పష్టం చేశారు.

ఈ వ్యవహారంపై మిస్వరల్డ్ ఆర్గనైజేషన్తో మాట్లాడినట్లుగా జయేశ్ రంజన్ వివరించారు. ప్రతి చోట అతిథుల జాబితా కూడా జాగ్రత్తగా సెలక్ట్ చేసినట్లుగా తెలిపారు. గెస్టంతా ఏదో రంగంలో ప్రముఖమైన వ్యక్తులనే ఎంపికచేసినట్లుగా ఆయన తెలిపారు. ఆరోపణలకు సంబంధించి తాను మిస్వరల్డ్ ప్రతినిధులతో మాట్లాడానని, వారు కూడా దీనిపై ఆరా తీస్తున్నారని జయేశ్ రంజన్ తెలిపారు. మిస్వరల్డ్ వారికి కూడా ఒక లీడ్ దొరికిందని వాటిని ఇప్పుడు బయట పెట్టే పరిస్థితి లేదని వివరించారు.

# జ్యోతి మల్హోత్రాకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ

తరువాయి భాగం

14 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీ విధించారు. ఆమెను హిసార్ సెంట్రల్ జైలు నంబర్2లో ఉంచనున్నారు. ఇది మహిళల జైలు.విచారణ సమయంలో కోర్టు లోపల గేట్లు మూసివేశారు. భారీ పోలీసు బలగాలను మోహరించారు. జ్యోతిని గతంలో ఐదు రోజుల రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. తాజాగా గడువు ముగిసిన నేపథ్యంలో కోర్టులో హాజరుపరిచారు. ఇదిలా ఉండగా.. జ్యోతి మొబైల్ కాల్ వివరాలు తొలగించినట్లుగా పోలీసులకు నివేదిక అందింది. అయితే, ల్యాప్‌టాప్ నుంచి తొలగించిన డేటా కోసం ఫోరెన్సిక్‌కు పంపగా.. నివేదిక ఇంకా అందలేదని అధికార వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా.. పాక్ కోసం గూఢచర్యం చేసిందన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాకు సంబంధించి కీలక విషయం వెలుగులోకి వచ్చింది. పాకిస్తాన్ పర్యటనలో అక్కడి అధికారులు రాచమర్యాదులు చేసినట్లు తెలుస్తున్నది. లాహోర్‌లోని అనార్కలీ బజార్‌ని సందర్శించిన సమయంలో యూట్యూబర్‌కు ఏకంగా ఆరుగురు గన్‌మెన్లు ఏకే 47తో భద్రత కల్పించినట్లుగా తేలింది. స్కాట్లాండ్‌కు చెందిన ఓ యూట్యూబర్ వీడియోతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. జ్యోతికి కల్పించిన సెక్యూరిటీని చూసి స్కాట్లాండ్ యూట్యూబర్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. 'కాలమ్ అబ్రాడ్' అనే యూట్యూబర్ స్కాటిష్ పౌరుడు కాలమ్ మిల్ గత మార్చి నెలలో పాక్‌లో పర్యటించారు. లాహోర్‌లోని ప్రసిద్ధ అనార్కలీ బజార్‌లో తిరుగుతుండగా.. అక్కడ కొందరు తుపాకులతో కనిపించారు. వారి చొక్కాలపై 'నో ఫియర్' అని రాసి ఉంది.

వారితో జ్యోతి మల్హోత్రా వీడియో రికార్డ్ చేస్తూ కనిపించింది. కాలమ్ మిల్ తనను తాను పరిచయం చేసుకుని, పాకిస్తాన్‌కు రావడం ఇది ఐదోసారని చెప్పింది. జ్యోతి తాను భారతీయురాలినని పరిచయం చేసుకోగా.. పాక్ ఆతిథ్యంపై ప్రశ్నించా.. 'చాలా బాగుంది' అంటూ జ్యోతి బదులిచ్చింది. జ్యోతి మల్హోత్రా ముందుకు వెళ్తున్న సమయంలో ఆ సాయుధ వ్యక్తులు ఆమెతోనే ఉన్నారని కాలమ్ మిల్ గుర్తించి.. ఆమెకు తుపాకులతో అంత భద్రత కల్పించాల్సిన అవసరం ఏంటీ? అంటూ వీడియోలో ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కాలమ్ మిల్ ఎలాంటి భద్రత లేకుండా ఒక్కరే తిరగ్గా.. జ్యోతి మల్హోత్రాకు ఇంత భారీ భద్రత ఎందుకన్నది చర్చనీయాంశంగా మారింది. అయితే, సాయుధులు యూనిఫాంలో లేనప్పటికీ మఫ్టీలో ఉన్న భద్రతా సిబ్బంది అయి ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ వీడియోతో జ్యోతికి పాకిస్తాన్‌లో ఎలాంటి పరిచయాలు ఉన్నాయో తెలుస్తున్నది. పాక్‌లో ఉన్నతస్థాయి పార్టీలకు హాజరై, అక్కడి భద్రత, నిఘా అధికారులను కలిసినట్లు అనుమానిస్తున్నారు. భారత్‌కు తిరిగివచ్చాక సైతం వారికి టచ్‌లో ఉన్నట్లు పోలీసుల విచారణలో ఆమె చెప్పినట్లు తెలుస్తున్నది.

# ద్రోహుల వల్లే నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్

తరువాయి భాగం

మంది మావోయిస్టులు 60 గంటల పాటు పోరాడారని, చివరకు కేశవరావును పట్టుకొని కాల్చిచంపారని తెలిపారు. బసవరాజ్ స్మృతిలో ప్రపంచ వ్యాప్తంగా సంస్మరణ సభలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. లొంగిపోయిన ద్రోహులు ఇచ్చిన సమాచారం మేరకే నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ జరిగిందని చెప్పారు. 6నెలలుగా మాడ్ ప్రాంతంలోనే నంబాల ఉన్నట్లు ప్రకటించారు. వారి ద్వారా మా రహస్య సమాచారం నిఘా సంస్థలకు ఎప్పటికప్పుడు అందుతూనే ఉన్నాయని జనవరి, మార్చి నెలల్లో కామ్రేడ్ బిఆర్ దాదాను లక్ష్యంగా చేసుకున్నారనే రెండు పెద్ద దాడులు జరిగాయని కానీ అవి విజయవంతం కాలేదని లేఖలో పేర్కొన్నారు.కేశవరావు టీమ్‌లో ఉన్న ఆరుగురు మావోయిస్టులు ఇటీవలే లొంగిపోయారని మావోయిస్టులు లేఖలో తెలిపారు. మే 17 నుండి, ఓరా వైపు నుండి నారాయణపూర్, కొండగావ్ ప్రాంతాల్లో డిఆర్ జీ సిబ్బందిని మోహరించడం ప్రారంభించారు. 18న, దంతెవాడ, బీజాపూర్, బస్తర్ ఫైటర్ నుండి సైనికులు లోపలికి వెళ్లారు. 19న ఉదయం 9 గంటలకు మా యూనిట్ దగ్గరకు చేరుకున్నారు. ఆపరేషన్ కు ఒక రోజు ముందు, 17న, ఆ యూనిట్ లోని ఒక PPC సభ్యుడు తన భార్యతో పారిపోయాడు. వారు పారిపోయిన తర్వాత, శిబిరాన్ని అక్కడి నుండి తరలించాం. 19న ఉదయం, పోలీసు బలగాలు సమీపంలోని గ్రామానికి చేరుకున్నాయని సమాచారం అందిన తర్వాత, క్యాంప్ అక్కడి నుండి బయలుదేరింది. మార్గమధ్యలో, పోలీసు సిబ్బందితో మొదటి ఎన్ కౌంటర్ ఉదయం 10 గంటలకు జరిగిందని ఆ తర్వాత రోజంతా ఐదు ఎన్ కౌంటర్లు జరిగాయి. ఈ ఎన్ కౌంటర్లలో ఎవరికి హాని జరగలేదు. చుట్టుముట్టబడిన ప్రాంతం నుండి బయటపడటానికి వారు 20వ తేదీన రోజంతా ప్రయత్నించారు. కానీ విఫలమయ్యారు. రాత్రిపూట 20 వేల మంది పోలీసు బలగాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయని తెలిపారు.గత 60 గంటలుగా తినడానికి, త్రాగడానికి ఏమీ దొరకలేదు. ఆకలితో ఉన్నా మావోయిస్టులుపై 20 వేల మంది పోలీసు బలగాల దాడిలో బిఆర్ దాదా అమరులయ్యారని స్పష్టం చేశారు. కేశవరావు సురక్షిత ప్రాంతానికి తరలిస్తామంటే ఆయన ఒప్పుకోలేదని అన్నారు. కేశవరావు కోసం 35మంది ప్రాణాలు అడ్డుపెడితే ఏడుగురం సురక్షితంగా బయటపడ్డామని తెలిపారు. 27మంది ఎన్ కౌంటర్‌లో చనిపోయారని చెప్పారు. పాకిస్థాన్‌తో చర్చలు జరిపినప్పుడు తమతో చర్చలు జరిపితే తప్పేంటని ప్రశ్నించారు. స్పెషల్ జోనల్ కమిటీ వికల్ప్ పేరుతో ఈ లేఖను మావోయిస్టులు విడుదల చేశారు.

**అంత్యక్రియలు పూర్తి..**

కాగా, మావోయిస్టు చీఫ్ నంబాల అంత్యక్రియలు సోమవారం సాయంత్రం పూర్తి అయ్యాయి. మాడ్ ప్రాంతంలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేశవరావు చనిపోయిన విషయం తెలిసిందే. కేశవరావు మృతదేహాన్ని అప్పగించాలంటూ బలగాలని కుటుంబ సభ్యులు కోరారు. కేశవ్‌రావు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించకుండా భద్రతా బలగాలు అంత్యక్రియలు పూర్తిచేశారు. అబూజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌లో మరణించిన నక్సలైట్లకు పోలీసులు అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహాన్ని అప్పగించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. నక్సల్ చీఫ్ బసవ రాజుతో సహా ఎనిమిది మంది నక్సలైట్ల మృతదేహాలను బలగాలు అంత్యక్రియలు పూర్తి చేశారు.

# రానున్న 4 రోజులు భారీ వర్షాలు

తరువాయి భాగం

సోమవారం నుంచి గురువారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని, ఇతర జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశాలున్నట్లుగా పేర్కొంది. ప్రస్తుతం మహబూబ్నగర్ వరకు నైరుతి రుతుపవనాలు విస్తరించాయి. మంగళవారం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని వివరించింది. ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. కాగా గురువారం ఉత్తర తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశముందని, ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలో గత కొద్ది రోజులుగా ఉదయం పూట అధిక ఉష్ణోగ్రతలు ఉండి, సాయంత్రం అయ్యే సరికి ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షాలు కురుస్తున్నాయి. ఇటీవల పలుచోట్ల కురిసిన అకాల వర్షాలకు రైతులకు నష్టం వాటిల్లింది. ఎండబెట్టిన ధాన్యం ఒక్కసారిగా వచ్చిన వర్షంతో తడిచిపోవడంతో అన్నదాతలు వాటిని కాపాడుకునేందుకు నానా తిప్పలు పడ్డారు. వర్షాలు పడుతున్న సమయంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం,
27.05.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## భీరన్న ఉత్సవాలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి



విశాలభారతి,భీమదేవరపల్లి:
మండలంలోని రంగయ్యపల్లి గ్రామంలో గొల్ల, కురుమ కులస్తుల ఆరాధ్య దైవమైన బీరన్న పెద్ద పండుగ అంగ రంగ వైభవంగా ప్రారంభం అయినది. ఈ పండుగకు హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి విచ్చేసి భీరన్న దేవునికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించి దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా గొల్ల కురుమస్థులు శాలువా కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ, భీరన్న దేవుని ఆశీస్సులతో రైతులు అందరూ పాడి పంటలతో, ప్రజలందరూ సుఖ శాంతులతో ఆయురారోగ్యలతో, జీవించాలని కోరారు.



## మానవత్వం చాటుకున్న స్నేహితులు

- స్నేహితురాలికి 50,000 రూపాయలు ఆర్థిక సాయం అందజేత

అడ్డగూడూరు, విశాలభారతి:
అడగూడూర్ జెడ్ పి హెచ్ ఎస్ హై స్కూల్ లో 10వ తరగతి చదివిన స్నేహితురాలు గుండాల మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన పెగ్గపురం సీత భర్త పెగ్గపురం శేఖర్ ఇటీవలే అనారోగ్య కారణంతో మరణించారు. విషయం తెలుసుకున్న అడ్డగూడూరులో తనతో చదువుకున్న 2013 14 ఎస్ఎస్సి బ్యాచ్ స్నేహితులు అందరూ కలిసి యాభై వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు.ఈ కార్యక్రమం లో బాలెంల అరవింద్, దాసరి అనిల్,మేకల పవన్, సుంకరి శివ కుమార్,డప్పు గోపి, లింగాల ప్రశాంత్, తుప్పత్తి నరేష్, పయ్యావుల సాయి కుమార్, పోలేపాక ఉపేందర్, డప్పు మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

- మద్దూర్ ఎస్సై విజయ్ కుమార్



మద్దూర్ ,విశాలభారతి:
నారాయణపేట జిల్లా మద్దూర్ మండల పరిధిలో అన్ నోన్ నంబర్ల నుంచి ఫోన్ చేసి నేను మద్దూర్ ఎస్సై ని అని చెప్పి డబ్బులు పంపించాలని పట్టణ వ్యాపారస్తులను,జ్యూవెలరీ షాప్ ల యజమానులను కొందరు అపరిచిత వ్యక్తులు(సైబర్ నేరగాళ్లు) భయపెట్టిస్తున్నారని,అలాంటి అన్ నోన్ అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్ పై పట్టణ వ్యాపారస్తులు అప్రమత్తంగా ఉండాలని మద్దూర్ ఎస్.ఐ విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.కొన్ని రోజుల క్రితం నుండి నేను మద్దూర్ ఎస్సైని మాట్లాడుతున్నానని ఎస్సై పేరిట సైబర్ నేరగాళ్లు అన్ నోన్ నెంబర్ నుండి కాల్ చేసి డబ్బులు పంపించాలని లేదంటే కేసులు నమోదు చేస్తామని బెదిరిస్తున్నారని,అలా డబ్బులు ఎవ్వరూ అడగరని ప్రతి ఒక్కరు గ్రహించాలని తెలిపారు.ఇకపై మద్దూర్ ఎస్సై అంటూ ఎవరైనా ఫోన్ చేసి బెదిరిస్తే, భయపడకుండా వెంటనే నేరుగా మద్దూర్ ఎస్.ఐ సెల్ 8712670407 కు లేదా డయల్ 100 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని మద్దూర్ ఎస్.ఐ విజయ్ కుమార్ కోరారు.ఇలాంటి అన్ నోన్ నంబర్ల కాల్స్ పై సైబర్ నేరగాళ్ళ పట్ల వ్యాపారస్తులు చాలా జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు.



## రజతోత్సవ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- మాణిక్యాపూర్ జెడ్పిహెచ్ఎస్ లో అపూర్వ కలయిక

విశాలభారతి,భీమదేవరపల్లి:
మండలంలోనిమాణిక్యాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 20002001 చదువుకున్న విద్యార్థులు ఆ రోజుల్లో గడిపిన మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తప్పు చేస్తే దండించిన ఉపాధ్యాయులను గుర్తు చేసుకున్నారు. క్రమశిక్షణకు మారుపేరుగా మార్చిన ప్రతి గురువుకు పేరుపేరునా శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. తరగతి గదుల్లో ఆడిన ఆట పాటలు, ఆకతాయితనంతో చేసిన చిలిపి చేష్టలను గుర్తు చేసుకుని సరదాగా మాట్లాడుకున్నారు. ఇక్కడే పుట్టి ఎక్కడెక్కడో స్థిరపడిన ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించుకున్నారు. కష్టం వస్తే తోబుట్టువులుగా మేము ఉన్నామని చిన్ననాటి స్నేహితురాళ్లకు భరోసా ఇచ్చారు. కష్టం వస్తే అన్నయ్య అని పిలవండి అండగా నిలబడతామని, ఒకరినొకరు కన్నీళ్లు పెట్టుకున్నారు. బరువెక్కిన హృదయాలతో చిన్ననాటి స్నేహితులు నిష్కమించారు.. ఈ కార్యక్రమంలో ప్రధానాచార్యులు ఉపాధ్యాయులు మరియు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## సిపిఐ పట్టణ కార్యదర్శిగా బూర వెంకటేశ్వర్లు



సూర్యాపేట,విశాలభారతి:
సూర్యాపేట పట్టణ సిపిఐ కార్యదర్శిగా పట్టణానికి చెందిన బూర వెంకటేశ్వర్లు రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ఆదివారం జరిగిన సిపిఐ పట్టణ నాలుగో మహాసభలో తనతో కలిపి 22 మంది కౌన్సిల్, మరియు పట్టణ కార్యవర్గ గా 14 మంది సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## పాలిసెట్ నందు రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకర్‌ను అభినందించిన జిల్లా ఎస్పి

- పాలిసెట్ నందు రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంక్ సాధించిన.
- మిర్యాల గ్రామ విద్యార్థిని శ్రీజ ను అభినందించిన జిల్లా ఎస్పి నరసింహ
- లక్ష్యం పెట్టుకుని చదివితే ఏదైనా సాధించవచ్చు
- జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్



సూర్యాపేట,విశాలభారతి:
విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చని, భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదుగుతారని జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ అన్నారు. పదవ తరగతి అనంతరం నిర్వహించే రాష్ట్రస్థాయి పాలిసెట్ నందు రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించిన నూతనకల్ మండలం, మిర్యాల గ్రామానికి చెందిన విద్యార్థిని శ్రీజ ను సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఎస్పీ నరసింహ ఐపీఎస్ అభినందించారు. విద్యార్థులు పాఠశాల దశ నుండే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని కష్టపడి చదవాలన్నారు. 10వ తరగతి తర్వాత ఎంచుకునే లక్ష్యం విద్యార్థులను ఉన్నతమైన గమ్యం వైపు నడిపిస్తుందని, ఇష్టమైన రంగంలో రాణించడానికి, మంచి భవిష్యత్తుకుచి పునాది అవుతుంది అన్నారు. గురువుల సూచనలు పాటిస్తూ, తల్లిదండ్రుల కళలను సాకారం చేయాలని అన్నారు. వివిధ రంగాల్లో దేశాభివృద్ధికి కృషి చేసిన గొప్ప వ్యక్తుల జీవిత విజయాలను స్ఫూర్తి తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమం నందు ఎస్పి గారి వెంట ఏ ఆర్ అధనపు ఎస్పి జనార్ధన్ రెడ్డి, సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్న కుమార్, విద్యార్థిని తండ్రి మధుసూధన్ రావు, స్నేహితులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.




## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఆరుగురికి జైలుశిక్ష

- పన్నెండు మందికి జరిమనా
- సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం.

సూర్యాపేట,విశాలభారతి:
మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు సూర్యాపేట పట్టణంలోని పలు ప్రాంతంలో వాహనాల తనిఖీలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ పద్దెనిమిది మంది పట్టుబడినట్లు ఎస్సై సాయిరాం తెలిపారు. పట్టుబడిన వారిని సోమవారం కోర్టులో హాజరు పరచగా సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి శ్రీమతి బి.వి.రమణ ఇద్దరికి రెండు రోజులు, మరో నలుగురికి ఒక్క రోజు జైలు శిక్ష, ఒక్కొక్కరికి రెండు వేలు జరిమానా, అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన మిగతా పన్నెండు మందికి కలిపి రూ.16,500/ జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పినట్లు ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడే వారికి చలానాలు విధించడంతో పాటు కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.



## మావోయిస్టుల మృత దేహాలను కుటుంబ సభ్యులకు అప్పచెప్పాలి

- మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి.
- ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలి.
- విలేకర్ల సమావేశంలో వామపక్ష, ప్రజా సంఘాల నాయకుల డిమాండ్

సూర్యాపేట,విశాలభారతి:
చత్తీస్ గడ్ ఎన్కౌంటర్ లో మృతిచెందిన27 మంది మావోయిస్టుల మృత దేహాలను కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు అప్పగించాలని వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ చత్తీస్ఘడ్‌లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో సహా 27మందిని ఎన్‌కౌంటర్ చేయడాన్ని వామపక్ష, ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండిస్తుందన్నారు.చర్చలకు తాము సిద్ధమేనని మావోయిస్టులు పదేపదే చేసిన విజ్ఞప్తులను కేంద్ర ప్రభుత్వం, చత్తీస్ఘడ్ రాష్ట్ర ప్రభుత్వాలు పెడచెవిన పెట్టి అమానవీయంగా మావోయిస్టులను తుడిచిపెట్టే విధానాన్ని అనుసరిస్తున్నాయని విమర్శించారు. పైగా ప్రధాని, హోంమంత్రి ప్రకటనలు ఎన్‌కౌంటర్‌పై హర్షం వ్యక్తం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు..చత్తీస్‌గడ్ లో జరిగిన ఎన్కౌంటర్ పై సుప్రీంకోర్టు సెట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేయాలని కోరారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు చేపట్టాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్ ఎల్.భద్రయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు,సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు కునుకుంట్ల సైదులు, సామాజిక అధ్యయన వేదిక కోకన్వీనర్ రేపాక లింగయ్య, బహుజన మహాసభ రాష్ట్ర కమిటీ సభ్యులు నారా బోయిన వెంకట్ యాదవ్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు, మందడి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సేవా దృక్పధంతో విధులు నిర్వహించాలి

- భూ సమస్యలను న్యాయబద్ధంగా పరిష్కరించేందుకు కృషి చేయాలి.
- 235 లైసెన్స్ సర్వేయర్లకి కిట్ పంపిణి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట,విశాలభారతి:
సేవా దృక్పధం తో లైసెన్స్ సర్వేయర్లు విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబు తో కలిసి కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ లైసెన్స్ సర్వేయర్ శిక్షణ కార్యక్రమం లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న భూముల సర్వే నిజాం కాలం నాటిదని ఆ సర్వే సహాయంతో లైసెన్స్ సర్వేయర్లు అప్డేట్ చేసుకుంటూ కచ్చితమైన మ్యాప్ ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం ఏంతో ప్రతిష్టత్మాకంగా భూ భారతి చట్టం రూపొందించటం జరిగిందని చట్టం అమలులో భాగంగా రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు భూముల మ్యాప్ పాస్ బుక్ లో ప్రింట్ ఇవ్వటానికి, భూములను సర్వే చేయుటకు లైసెన్స్ సర్వేయర్ల నుండి దరఖాస్తులు ఆన్లైన్ ద్వారా స్వీకరించటం జరిగిందని, జిల్లాలో మొదటి విడత కింద 235 మంది అభ్యర్థులకి మే 26 నుండి జూలై 26 వరకు శిక్షణ ఇవ్వటం జరుగుతుందని తెలిపారు.అభ్యర్థులు అందరు యువత కాబట్టి చురుకుగా పనిచేస్తూ భూ సమస్యలని న్యాయబద్ధంగా పరిష్కరిస్తూ రైతులపట్ల మంచి ప్రవర్తనతో మెలగాలని కలెక్టర్ సూచించారు. నిత్య జీవితంలో ఎన్ని మార్పులు, సాంకేతిక మార్పులు, కంప్యూటర్స్, ఇతర సాఫ్ట్ వేర్ టెక్నాలజీలు రోజు రోజుకు కోత్తగా వస్తున్నాయని, టెక్నాలజీ పెరుగుతున్నదని, ఎన్ని మార్పులు జరిగినా కూడా ఈ భూముల విషయంలో మాత్రం సహజంగానే అలాగే ఉన్నామని, రైతులు ఈ భూముల వ్యవసాయం చేస్తేనే మనమంతా సుఖ,సంతోషములతో బ్రతుకుచున్నామని, అందుకే ఈ భూములను ఎప్పటికప్పుడు పర్యవీక్షిస్తూ, ఎలాంటి గెట్టు తగాదాలు లేకుండా ఉడెందుకు గాను, హద్దులను కాపాడేందుకుగాను, సర్వేయర్ ల కొరత తీరెందుటకై రాష్ట్ర ప్రభుత్వము "భూ భారతి" స్కీం ప్రారంభించిందని తెలిపారు. ఈ స్కీం ద్వారా భూములు, లావాదేవిలు, జరిగినప్పుడు సర్వే చేసీ హద్దులను నక్షాల్లో పొందుపరిచిన తర్వాత రిజిస్ట్రేషన్లు జరుగుతాయని, దీనివలన తగాదాలకు చోటు ఉండదని కలెక్టర్ తెలిపారు ..ఈ కార్యక్రమంలో ఎడి ఎస్ ఎల్ ఆర్ శ్రీనివాస రెడ్డి, డిప్యూటీ ఇన్స్ పెక్టర్ చంద్రశేఖర్, ప్రకాష్, సర్వేయర్లు శ్రీనివాస్, శ్యామ్, సమీర్, అలెన్ జోసెస్,అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నాచారం డివిజన్లో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

- ఎమ్మెల్యే బండారి లక్ష్మరెడ్డి

నాచారం, విశాలభారతి:
మల్లాపూర్ డివిజన్ పరిధిలో ఓల్డ్ మల్లాపూర్, బీసీ ఏరియాలో 51 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు మరియు 12 లక్షల రూపాయలతో నాచారం, బాబానగర్ కాలనీలోని రజక శ్మశాన వాటికలో బర్నింగ్ ఫ్లాట్ ఫార్మ్, స్నానపు గదుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మరెడ్డి కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, ఈ శంకుస్థాపన కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఇంజినీరింగ్ డీ ఈ రూపా, ఏఈ శ్రవంతి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు సాయి జెన్ శేఖర్, ఓల్డ్ మల్లాపూర్ వాసులు, నాచారం రజక సంఘం సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు



# బొల్లారం పోచమ్మ దేవాలయం నిర్మాణానికి.. రూ.10 లక్షల విరాళం అందించిన ఎమ్మెల్యే జీఎంఆర్

**పటాన్ చెరు,విశాలభారతి**

పటాన్ చెరు నియోజకవర్గంలో నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ ఆర్థిక సహకారం అందిస్తున్నామని స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ దేవాలయం నిర్మాణానికి తన వంతు సహాయంగా ఎమ్మెల్యే జిఎంఆర్ 10లక్షల రూపాయల విరాళం ప్రకటించారు. ఈ మేరకు సోమవారం ఉదయం స్థానిక నాయకులతో కలిసి దేవాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులకు పది లక్షల రూపాయల విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండు దశాబ్దాల కాలంగా నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలు పట్టణాలు డివిజన్ల పరిధిలో సొంత నిధులతో 200 లకు పైగా దేవాలయాలు నిర్మించినట్లు తెలిపారు. పురాతన ఆలయాలను సైతం జీర్ణోధారణ చేస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరిలో దైవం భక్తి పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో జిన్నారం మాజీ జెడ్పిటిసి బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ హనుమంత్ రెడ్డి, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, గ్రామ పుర ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


విశాల భారతి

తెలుగు దిన పత్రిక

శనివారం,
26.10.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com




## పోస్టర్ ఆవిష్కరణ



**విశాలభారతి,భీమదేవరపల్లి :**
ఐక్య పోరాటాలతో జర్నలిస్టుల హక్కులను సాధించుకుందాం అనే పిలుపుతో టియుడబ్ల్యూజె (హెచ్ 143) రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ పిలుపుతో ఈనెల 31న హైదరాబాదులో జరిగే తెలంగాణ జర్నలిస్టుల ఫోరం 25 వసంతాల రజతోత్సవ సభ , టిడబ్ల్యూజే 143 మండల యూనియన్ అధ్యక్షుడు కోల రమేష్ ఆధ్వర్యంలో ముల్కనూర్ అంబేద్కర్ కూడలిలో సోమవారం రోజున పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మేకల శ్యామ్, బిక్షపతి, అలుగు రమేష్, ఉడుత శ్రీనాథ్, అప్పని సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత

- ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్



**ఇబ్రహీంపట్నం,విశాలభారతి :**

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, డీఆర్ఓ సంగీతతో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 56 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# మేము సైతం నీలం కోసం..

## నీలం మధుకు మద్దతుగా కదులుతున్న యువత

- రాష్ట్ర వ్యాప్తంగా సోషల్ మీడియా టీం లు
- ప్రతి జిల్లా, నియోజకవర్గం, మండల, గ్రామాల వారిగా కమిటీలు
- చిట్కుల్ క్యాంపు కార్యాలయంలో కలిసిన కామారెడ్డి, సూర్యాపేట, సిద్దిపేట జిల్లాల టీంలు



**పటాన్ చెరు,విశాలభారతి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాటలో పయనిస్తున్న మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధుకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా యువత మేము సైతం నీలంకు తోడుగా అంటూ ముందుకు వచ్చింది. సామాజిక న్యాయం, బహుజనుల ఐక్యత కోసం పోరాటం చేస్తున్న నీలం మధుకు తాము తోడుంటామని 33 జిల్లాల యువకులు కదిలారు. కాంగ్రెస్ పార్టీ మరియు నీలం మధు సేవలను విస్తృతంగా ప్రజా క్షేత్రంలోకి తీసుకుని వెళ్లేందుకు యువకులు స్వచ్ఛందంగా సన్నద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలతో పాటు 119 నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారిగా సోషల్ మీడియా టీం లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే 21 జిల్లాలలో నీలం మధు అభిమానులు జిల్లా సోషల్ మీడియా కమిటీలు ఏర్పాటు చేయగా సోమవారం మూడు జిల్లాలు సిద్దిపేట, సూర్యాపేట, కామారెడ్డిలకు చెందిన యువత నీలం మధును మర్యాదపూర్వకంగా కలిశారు.
బీసీల రిజర్వేషన్లతో పాటు ఎస్ సీ వర్గీకరణ కలను సాకారం చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాటలో నీలం మధు నడుస్తూ సామాజిక న్యాయం సాధించే దిశగా చేస్తున్న పోరాటాన్ని యువత స్వాగతించారు. రాష్ట్ర ప్రభుత్వానికి,నీలం మధు కి మద్దతు గా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో కమిటీలను ఏర్పాటు చేసి ప్రచారాన్ని ఉధృతం చేస్తామని ప్రకటించారు. తన మీద ప్రేమ అభిమానలతో రాష్ట్ర వ్యాప్తంగా సోషల్ మీడియా టీం లు ఏర్పాటు చేస్తున్నందుకు నీలం మధు వారిని అభినందించారు.
ఇందిరమ్మ స్ఫూర్తితో తెలంగాణలో పాలన కొనసాగిస్తున్న రేవంత్ రెడ్డి సంక్షేమ పథకాలను, కాంగ్రెస్ పార్టీ ఆశయాలను సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయాలని సూచించారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించే విధంగా కృషి చేయాలన్నారు.
ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం అందిస్తూ సేవ కార్యక్రమాలలో సైతం మీరంతా పాలుపంచుకోవాలని కోరారు. ఎల్లప్పుడూ తన సంపూర్ణ మద్దతు మీకు ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహేష్, రంజిత్, అశోక్ ముదిరాజ్, సిద్దిపేట శేఖర్, సూర్యాపేట కరుణాకర్, కామారెడ్డి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# బట్టీ చదువులు భవిష్యత్తుకు చేటు



**జి. అజయ్ కుమార్**
**వ్యక్తిత్వ వికాస నిపుణులు**

## బట్టీ చదువులు వద్దు- ఆత్మస్థైర్యాన్ని నింపే చదువులు ముద్దు

ఈ రోజుల్లో చదువు అనేది పిల్లల జీవితాల్లో ఓ భయంగా, ఓ భారం గా, ఓ పోటీగా మారిపోయింది. "పాస్ అవ్వాలి, ర్యాంక్ రావాలి, ఉద్యోగం రావాలి, అప్పుడే జీవితం సెటిల్" అనే ఒకే విధమైన లక్ష్యంతో నడుస్తున్న విద్యా వ్యవస్థ, నిజమైన విజ్ఞానాన్ని కాకుండా మార్కులను మాత్రమే అంగీకరించే విధంగా రూపాంతరం చెందుతోంది.. చిన్నచిన్న పిల్లలకే మోయలేని బ్యాగుల బరువులు చిన్న తనంలోనే నడుము వంగిపోయి అవస్థలు పడడం, చదువుల ఒత్తిడితో చిన్నతనంలోనే కంటి చూపు మందగించడం నేటి పిల్లలకు శాపంలా మారింది

ఈ దృష్టికోణం యువతను చదువు పట్ల అసహనంతో నింపుతుంది. చదువు అనేది జీవన నైపుణ్యాన్ని కల్పించాలి కానీ ఒత్తిడిని పెంచకూడదు. కానీ ఈ రోజు పరిస్థితి చూస్తే, చదువు విద్యార్థులకు భారం అయింది – అది భవిష్యత్తును నిర్మించక, నిస్సారంగా మారుస్తోంది.
ఒక విద్యార్థి పరీక్షలలో మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత సాధిస్తాడు కానీ అతనికి జీవితంలో ఎదురయ్యే చిన్న సమస్యలను కూడా ఎదుర్కొనే ధైర్యం ఉండదు అలా చాలా మంది విద్యార్థులు నేటి సమాజంలో చదువులో రాణిస్తున్నారు కానీ జీవితంలో విఫలమవుతున్నారు, ఇది మన విద్యావిధానానికి పెను సవాలుగా మారింది

**బట్టీ చదువు అంటే ఏమిటి..?**
బట్టీ చదువు అనేది అవగాహన లేకుండా పాఠ్యాంశాలను యాంత్రికంగా గుర్తుపెట్టుకోవడం. ఇది చిన్నపాటి మెమరీ గేమ్ మాత్రమే. దాన్ని పరీక్షలో వాంతి చేసి బయట పెడతారు. తరువాత మిగలేది? శూన్యం!
ఈ పద్ధతిలో చదివిన విద్యార్థులు జీవితంలోని అసలైన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేరు. పరిచయ సమస్యలు, ఆచరణలో ఎదురయ్యే సవాళ్ళను తట్టుకోలేరు. దీని వలన వారు మరింత అస్థిరతకు లోనవుతారు.

**బట్టీ చదువు దుష్పరిణామాలు:**

**ఆత్మవిశ్వాస లోపం:**
చదివినది అర్థం కాకపోవడం వల్ల నిర్ధారణ లేకుండా ఒక నిర్ణయానికి రావడం , ఆత్మవిశ్వాసంతో నిర్ణయాలు తీసుకోలేకపోవడం

**సొంత తెలివి ఉపయోగించలేరు :**
ప్రశ్నల వెనుక ఉన్న భావాన్ని పట్టుకోలేరు, స్వతంత్రంగా ఆలోచించలేరు.

**సృజనాత్మకత లోపించడం:**
కొత్తగా ఆలోచించగల శక్తి లేకుండా తయారవుతారు
సమస్యలపై స్వయం నిర్ణయం తీసుకునే ధైర్యం లేకుండా మారతారు.

**మానసిక ఒత్తిడి:**
మార్కుల భయం, తల్లిదండ్రుల అంచనాలు, సమాజపు వత్తిడితో మానసిక స్థైర్యం కోల్పోతున్నారు.



**అయితే చదువుకి అసలైన అర్థం ఏమిటి?**

**విద్య అంటే...**
మంచి వ్యక్తిగా తయారవడం
ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడం
జీవిత సమస్యలకు పరిష్కారం చూపగలగడం
విద్య అంటే "జ్ఞానం ,ఆచరణ , ఆత్మస్థైర్యం". ఇది ఏదో పుస్తక జ్ఞానంతో పరిమితం కాక, జీవితాన్ని అర్థం చేసుకునే దిశలో ఉండాలి.

**నిజమైన విద్య ఎలా ఉండాలి?**

***అభిరుచి ఆధారంగా కోర్సులు:**
ప్రతి విద్యార్థికి ఒక ప్రత్యేకమైన ప్రతిభ ఉంటుంది. అందరినీ ఒకే తాటిపై కట్టే ప్రయత్నం కాకుండా, ప్రతి ఒక్కరి ఆసక్తిని గుర్తించి, దాన్ని అభివృద్ధి చేసేలా విద్యావిధానం ఉండాలి.

**జీవిత విద్య :**
పిల్లలకు పరీక్షల్లో ఉత్తీర్ణతకన్నా ముందుగా, జీవనంలో ఎలా నడవాలో నేర్పించాలి. ఆత్మస్థైర్యం, కమ్యూనికేషన్, నిర్ణయాలు తీసుకునే శక్తి వంటి జీవన నైపుణ్యాలు ప్రధాన పాత్ర పోషించాలి.

**ప్రయోగాత్మక విద్య :**
పుస్తకాల నుంచి కన్నా, అనుభవ పూర్వకంగా క్షేత్ర స్థాయిలో స్వయంగా నేర్చుకునే పాఠాలే విద్యార్థులలో గొప్ప ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తాయి , దీర్ఘకాలికంగా గుర్తుండే అవకాశం వుంది, జీవితంలో సమస్యల సాధనకు కూడా ప్రయోగాత్మక విద్య ఎంతో సహాయ పడుతుంది


**విలువలతో కూడిన విద్య:**
విద్యార్థులలో నైతికత, మానవత, సానుభూతి వంటి విలువలు పాఠ్యాంశాలతో పాటు మిళితమై ఉండాలి. మార్కుల కన్నా మానవతా విలువలు వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దుతాయి.

**తల్లిదండ్రులు తెలుసుకోవాల్సింది:**
మార్కులు జీవితాన్ని నిర్వచించవు. పిల్లలు మంచి మార్కులు,ర్యాంక్ సాధించకపోయిన వారిని నిందించకండి. వారి లోపాలను గుర్తించి, మానసికంగా వారిలో ధైర్యాన్ని. విశ్వాసాన్ని నింపాలి అదే తల్లిదండ్రులు వారి పిల్లలను నిజమైన విజేతలగా తీర్చిదిద్దడానికి దోహదపడుతుంది

**ఉపాధ్యాయులు ఆలోచించాల్సింది :**
మీరు బోధించేది పాఠ్యాంశం మాత్రమే కాదు, ఓ జీవన దిశ. విద్యార్థుల్లో ఆలోచన, ప్రశ్నించే ధైర్యం, విశ్లేషణ, జ్ఞానాన్ని వినియోగించే నైపుణ్యాన్ని పెంపొందించాలి. మార్కులు పొందే విద్యార్థులు కాక, మార్గదర్శకులు తయారు చేయండి.

**విద్యార్థులు గుర్తుంచుకోవాల్సింది :**
మీరు చదివేది పుస్తకం కాదు – ఒక జీవితాన్ని నిర్మించే సాధన. మార్కులు మీ విజయాన్ని నిర్వచించవు. మీరు ఎంతగా సమస్యలను అర్థం చేసుకుని, వాటిని ఎదుర్కొనే ధైర్యాన్ని పెంచుకుంటారో, అదే మీ నిజమైన విజయానికి మూలం.

**ఈ మార్పు:**
కుటుంబం నుంచి
పాఠశాల నుంచి
విద్యావిధానం నుంచి మాత్రమే కాక
ప్రధానంగా అందరి మనసుల నుంచి రావాలి.
పిల్లలకు భయాన్ని కాదు, లక్ష్యం వైపు నడిపించే ధైర్యాన్ని కలిగించే చదువు అవసరం.



విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం,
27.05.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## నేడు శనేశ్వర స్వామి జన్మోత్సవం

**నారాయణపేట, విశాలభారతి:**

నారాయణపేట బోరంబావి శనీశ్వర దేవాలయం దగ్గర మంగళవారం శనీశ్వర స్వామి జన్మ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు భక్తమండలి సభ్యులు తెలిపారు.ఉదయం 11:30 గంటలకు శనీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు తైలాభిషేకం ఉంటుందన్నారు.మధ్యాహ్నం 12 గంటలకు వర్షం దృశ అవధూత మఠంలో అన్నదాన కార్యక్రమం జరుగుతుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని భక్త మండల సభ్యులు కోరారు.



## రూ.60 లక్షలతో బొల్లారం జిల్లా పరిషత్ పాఠశాల ఆధునీకరణ

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు,విశాలభారతి**

బొల్లారం మున్సిపల్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను 60 లక్షల రూపాయల సిఎస్ఆర్ నిధులతో ఆధునికరిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో కలిసి పాఠశాలలను పరిశీలించారు. సమస్యలను స్వయంగా పరిశీలించారు. క్రీడా ప్రాంగణంలో సౌకర్యాలు లేకపోవడం మూలంగా విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారని మాజీ జెడ్పిటిసి బాల్ రెడ్డి ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ..60 లక్షల రూపాయల సిఎస్ఆర్ నిధులతో పాఠశాలను ఆధునికరించినందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రధానంగా పాఠశాలకు పూర్తిస్థాయిలో రంగులు వేయడంతో పాటు.. గ్రౌండ్ లెవెలింగ్, క్రీడా ప్రాంగణంలో వాలీబాల్, బ్యాడ్మింటన్, ఫుట్ బాల్ కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే లోపు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు హనుమంత్ రెడ్డి, చంద్రారెడ్డి, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## పెండింగ్ కేసులను న్యాయ అధికారుల సమన్వయంతో పరిష్కరించాలి

- జిల్లా ఎస్పీ శ్రీ యోగేష్ గౌతమ్ ఐపిఎస్

**నారాయణపేట, విశాలభారతి:**

పెండింగ్ కేసులను న్యాయ అధికారుల సమన్వయంతో పరిష్కరించాలని జిల్లా ఎస్పీ శ్రీ యోగేష్ గౌతమ్ ఐపిఎస్ అన్నారు. సోమవారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ జిల్లా పోలీస్ అధికారులు,కోర్టు డ్యూటి అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి రానున్న జాతీయ లోక్ అదాలత్ లో న్యాయ అధికారుల సమన్వయంతో పెండింగ్ లో ఉన్న కేసులను ఆన్లైన్లో ప్రొజెక్టర్ ద్వారా వివరించి ఎక్కువ మొత్తంలో పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి కేసులో నాణ్యమైన ఇన్వెస్టిగేషన్ను త్వరిత గతిన పూర్తి చేసి,నిర్ణీత సమయంలో కేస్ ఫైల్ కోర్టు కు పంపేవిధంగా చూడాలని పోలీసు అధికారులకు సూచించారు.కోర్ట్ డ్యూటి అధికారులు చార్జ్ షీట్ దాకలు మొదలుకొని,తీర్పు వెలువడే వరకు ఫిర్యాదు బాధితులకు అండగా ఉంటూ,నిందితులు సాక్షులను ఇబ్బందులు కలిగించకుండా చూడాలన్నారువీలైనన్ని ఎక్కువ కేసులో దోషులకు శిక్ష పడేలా చూడాలని, పోక్సో, అత్యాచార కేసులలో దోషులు తప్పించుకోవడానికి వీలులేదు అన్నారు. వివిధ కేసులలో సైంటిఫిక్, ఎలక్ట్రానిక్ సాక్షాదారాలు చాలా కీలకం అని,ఈ సాక్షాదారణ వలన నిందితులను తప్పించుకోవడానికి అవకాశం లేదని ప్రతి కేసులో సైంటిఫిక్ వీడియో ఫోటోగ్రఫీ చాలా కీలకమన్నారు. అవన్నీ చూపించు కోర్టులో నేరస్తులకు శిక్ష పడే విధంగా చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో సిఐలు రామ్ లాల్,రాజేందర్ రెడ్డి,సైదులు ,ఎస్సైలు,కోర్ట్ డ్యూటి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆది ధ్వని సొసైటీకి ఇచ్చిన ప్రొఫెసర్స్ క్వార్టర్స్ అనుమతిని వెంటనే నిలిపివేయాలి

- ఓయూ రిజిస్ట్రార్ కి వినతి
- అధికారులు నిలిపివేయకుంటే బిఆర్ఎస్వీఅడ్డుకుంటుంది

**విశాలభారతి, ఓయూ:**



ఉస్మానియా యూనివర్సిటీ సమీపం లో ఆర్టీసీ హాస్పిటల్ ఎదురుగా ఉన్నటువంటి ఓయూ ప్రొఫెసర్ క్వార్టర్స్ నీ ఆది ధ్వని సంస్థ పేరుతో 30 సంవత్సరాల 30 సంవత్సరాల లీజ్ కి ఇవ్వాలని యూనివర్సిటీ అధికారులు ఒప్పందం చేసుకోవడం నిజంగా సిగ్గుచేటు ,జస్టిస్ చిన్నప్ప రెడ్డి కమిషన్ కి విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులకు యూనివర్సిటీ అధికారులు భూమిని కేటాయించడం నిజంగా విడ్డురకరం ,యూనివర్సిటీ భూములు 2400 ఎకరాల నుండి 13వందల ఎకరాలకు తగ్గిపోయి ఎక్కడికి అక్కడ కబ్జాకు గురి అయ్యి అన్యాక్రాంతం అవుతుంటే యూనివర్సిటీ అధికారులు ఈ భూములను కాపాడాల్సింది పోయి వారే ఆ భూములను నిబంధనలకు విరుద్ధంగా లేజ్ కి ఇస్తూ ప్రైవేటు వ్యక్తులకు భూములను దానదత్తం చేసిన అధికారులకు యూనివర్సిటీ పై ,యూనివర్సిటీ భూములపై ఏ విధంగా శ్రద్ధ ఉందో అర్థమవుతుందని బిఆర్ఎస్వి విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం లో వారు సోమవారం ఓయూ రిజిస్ట్రార్ కి వినతిపత్రం అందజేశారు. ప్రొఫెసర్ క్వార్టర్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లకు నెలకు 30 నుండి 40 వేల రూపాయలకి HRA విధించి ఇస్తారు కానీ ఆది ద్వని ప్రైవేటు సంస్థకు , ప్రైవేటు వ్యక్తులకు నెలకు 1000 రూపాయిలు కేటాయిస్తూ లీజుకు ఇవ్వడంలో అంతర్యం ఏమిటో అధికారులు సమాధానం చెప్పాలన్నారు. యూనివర్సిటీ భూములకు లీజుల పేరుతో ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడితే అధికారులకు తగిన గుణపాఠం చెప్తామని తెలిపారు. యూనివర్సిటీలో జరిగే ప్రతి ఒక్క జీఓలు ఏమైనా సరే ఓయూ వెబ్సైట్ లో తెలియపర్చాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి జంగయ్య ,ప్రశాంత్ ,మిథున్ , నాగేందర్ రావు,అవినాష్ , వినోద్ ,సతీష్ పాల్గొన్నారు.





# ప్రమాదాలకు నెలవుగా మారిన హుజూరాబాద్

### ట్రాఫిక్ సిగ్నల్స్, స్పీడ్ బ్రేకర్స్ లేకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు

- హుజూరాబాద్ లో వరుస ప్రమాదాలు
- నిత్యం ప్రమాదాలు భయపడుతున్న స్థానికులు
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం
- చొరవ తీసుకుని ప్రజల ప్రాణాలు కాపాడాలని స్థానికుల విజ్ఞప్తి



రోడ్డు ప్రమాదాల నుండి ప్రజలను కాపాడాల్సిన బాధ్యత నాయకులు, అధికారుల పై ఉంది. హుజూరాబాద్ లో ఇటీవల ప్రమాదాలు వరుసగా జరుగుతున్నాయి. వాటి నివారణకు తగు చర్యలు తీసుకోవాలనిపరిష్కార మార్గం చూపాలని బీసీ ఆజాదీ ఫెడరేషన్ జిల్లా కమిటీ తరపున కోరుతున్నాం.

**బీసీ ఆజాదీ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు**
**చిలుకమరి శ్రీనివాస్ ( హుజూరాబాద్ )**



హుజూరాబాద్ కూడలి లో ట్రాఫిక్ తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పలుచోట్ల యాక్సిడెంట్లు జరిగి గాయాలపాలై ఆస్పత్రిపాలైన ఘటనలు చూశాం. కొన్ని సందర్భాల్లో మృత్యువాత చెంది వారి కుటుంబాలు రోడ్డున పడ్డ పరిస్థితులను కూడా ఉన్నాయి. వెంటనే హుజూరాబాద్ లో ట్రాఫిక్ సిగ్నల్స్, స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలి.ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి.

**కూతాటి రాణా ప్రతాప్**
**పి డి ఎస్ యు ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి. ( హుజూరాబాద్ )**

**విశాలభారతి,హుజూరాబాద్ :**





వరంగల్ నుండి హుజూరాబాద్ మీదుగా కరీంనగర్ వెళ్ళు ప్రధాన రహదారి నిత్యం ప్రమాదాలకు గురవుతుంది. హుజూరాబాద్ లోని స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో గల కూడలి ప్రమాదాలకు కేరాఫ్ గా నిలుస్తుంది.నిత్యం ఏదో ఒక ప్రమాదం సంభవించి గాయాలపాలౌతున్నారు. వరంగల్ నుండి హుజూరాబాద్ మీదుగా కరీంనగర్ వెళ్లే ఈ రహదారి రద్దీగా ఉండడంతో హుజూరాబాద్ లోని చాలా చోట్ల ప్రమాదాలకు దారితీస్తుంది.ఈ రహదారి ప్రధాన రహదారి కావడంతో కరీంనగర్ నుండి వరంగల్ కు, వరంగల్ నుండి కరీంనగర్ కు అతివేగంతో వేలాది అతి భారీ వాహనాలు ఓవర్ లోడ్ తో వెళ్తుండడం, ఫోర్ వీలర్ వెహికిల్స్, టూ వీలర్ వెహికిల్స్ కూడా ఓవర్ స్పీడ్ తో రాష్ డ్రైవింగ్ చేస్తుండడంతో వరుసగా ప్రమాదాలు జరుగుతున్నాయి.దీంతో అటువైపుగా వెళ్లాలంటేనే ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

**ప్రమాదాలకు నెలవుగా మారిన హుజూరాబాద్...**

ప్రధాన రహదారి కావడంతో హుజూరాబాద్ పట్టణంలో చౌరస్తాతో పాటుగా చాలా చోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. హుజూరాబాద్ చౌరస్తాలో ఇటీవలే బైక్ ని, టిప్పర్ లారీ ఢీ కొట్టిన ఘటనలో ప్రైవేటు బ్యాంకు ఉద్యోగి మరణించిన సంఘటన స్థానికులతో పాటుగా చుట్టుపక్కల ప్రాంతాల వారిని కలచివేసింది.ఇలాంటి ప్రమాదాలు చాలానే జరిగాయి.సైదపూర్ క్రాస్ లో కార్ యాక్సిడెంట్ తోపాటు మున్సిపల్ కార్మికురాలి ఇన్సిడెంట్ ఇలా చాలా వరకు ప్రమాదాలు ఎన్నో జరిగాయి. హుజూరాబాద్ డిపో క్రాస్, జమ్మికుంట మెయిన్ రోడ్, పరకాల క్రాస్ ఏరియాలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.ఎక్కడ కూడా స్పీడ్ బ్రేకర్స్ లేకపోవడం ఈ ప్రమాదాలకు ఒకింత కారణం.వరంగల్ నుండి కరీంనగర్ ప్రధాన రహదారి కావడంతో లారీలు ,ఆర్టీసీ బస్సులు,ఇతర వాహనాలు వేల సంఖ్యలో వెళ్తుంటాయి. ఇటు హుజూరాబాద్ మీదుగానే హుస్నాబాద్ నియోజకవర్గాన్ని కలుపుతూ... హుస్నాబాద్ పరిధిలోని వివిధ మండలాల గ్రామాల ప్రజలు హుజూరాబాద్ కు వెళ్తారు.ఇటు జమ్మికుంట నుండి హుజూరాబాద్ కు నిత్యం వంద సంఖ్యలో ప్రజలు వారి వారి అవసరాల రీత్యా వస్తుంటారు.పరకాల, హనుమకొండ జిల్లాలోని కమలపూర్, ఎల్కతుర్తి ఇలా చుట్టుపక్కల మండలాలల, గ్రామాల ప్రజలు హుజూరాబాద్ కేంద్రంగానే తమ పనుల నిమిత్తం ప్రయాణాలు సాగిస్తారు.ఇలా నిత్యం రద్దీగా ఉండే హుజూరాబాద్ ప్రాంతం ప్రమాదాలకు నెలవుగా మారడంతో ప్రజలు వారి ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు.

**ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ సిగ్నల్స్, స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలి...**

వరుస ప్రమాదాల దృష్ట్యా హుజూరాబాద్ రోడ్డు పై ప్రయాణించాలంటే స్థానిక ప్రజలు జంకుతున్నారు.

రోడ్డు పైకి వస్తే ఎప్పుడు అటునుంచి ఏ ప్రమాదం వస్తుందో తెలియని పరిస్థితి. ఉదయం పారిశుధ్య కార్మికులు రోడ్డు పైకి వచ్చి పనిచేయడానికి భయపడుతున్నారు. హుజూరాబాద్ కూడలి ప్రాంతం ఇరుగ్గా ఉండడంతో జమ్మికుంట నుండి వచ్చే ఆర్టీసీ బస్సులు, లారీలతో, ఇతరత్రా వాహనాలతో రోడ్డు మొత్తం నిండిపోయి బస్టాండ్ నుండి వచ్చే ఆర్టీసీ బస్సులతో కరీంనగర్, వరంగల్ ప్రధాన రహదారి మొత్తం ట్రాఫిక్ జామ్ అవుతుంది.కరీంనగర్ నుండి వచ్చు బస్సులు బస్టాండ్ ప్రాంగణం లోపలికి వెళ్ళు క్రమంలోనే ఆటోలు, టూ వీలర్ వాహనాలు ఉండడంతో ఆ ప్రాంతం మొత్తం రద్దీగా మరి ప్రమాదాలకు మరింతగా అసౌకర్యం అవుతుంది. ఇటివలే బస్టాండ్ ప్రాంగణం నుండి ఆర్టీసీ బస్సు బయటకు వెళ్ళే సమయంలో కరీంనగర్ నుంచి వచ్చే గ్రానైట్ లారీ, బస్సు వెనుక భాగాన్ని ఢీ కొట్టడంతో బస్సు వెనుక భాగం నుజ్జునుజ్జు అయింది.ఈ క్రమంలో ప్రయాణికులకు ఏమి జరగకపోవడంతో బస్సులో ఉన్నవారంతా ఊపిరి పీల్చుకున్నారు.ఇలా ప్రమాదాలు ఎన్నో జరిగిన సంఘటనలు ఉన్నాయి.హుజూరాబాద్ పట్టణంలోని ప్రధాన కూడలి అయిన అంబేద్కర్ చౌరస్తాతో పాటుగా నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చు. సిగ్నల్స్ తో పాటుగా పలుచోట్ల స్పీడ్ బ్రేకర్స్ కూడా ఏర్పాటు చేస్తే చాలా వరకు ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చు. నిత్యం ప్రయాణించే ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలని స్థానిక మంత్రి,నియోజకవర్గ ఎమ్మెల్యే, ఆర్ & బి అధికారులు, పోలీసులు, మున్సిపల్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని పట్టణ ప్రజలు,స్థానికులు కోరుతున్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక





## పొట్టి నిక్కర్‌లో అందాల ఐశ్వర్య

స్పై, భజే వాయు వేగమ్ సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ ఐశ్వర్య మీనన్. గత ఏడాదిలో ఈమె నటించి మలయాళ మూవీ బాజూకా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి చాలా కాలం అయినా లక్ కలిసి రాకపోవడంతో కమర్షియల్ బ్రేక్ దక్కించుకోలేక పోయింది. అయితే సోషల్ మీడియాలో ఈమె షేర్ చేసే అందాల ఆరబోత ఫోటోలు, వీడియోల కారణంగా ఎప్పటికప్పుడు వార్తల్లో నిలుస్తూ, వైరల్ అవుతూ వస్తుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపు 3.3 మిలియన్ ఫాలోవర్స్ కలిగి ఉన్న ఈ అమ్మడు షేర్ చేసే ప్రతి ఫోటో షూట్ వైరల్ కావడం మనం చూస్తూనే ఉన్నాం. తాజాగా మరోసారి ఈ అమ్మడి ఫోటోలు వైరల్ అవుతున్నాయి ఈ తమిళ ముద్దుగుమ్మ 2012లో కాదలిల్ సోదప్పవదు యెప్పడి అనే తమిళ్ సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. మొదటి సినిమాతో పెద్దగా గుర్తింపు దక్కనప్పటికీ 2013లో ఏకంగా మూడు సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకుంది. హీరోయిన్‌గా మెల్ల మెల్లగా కెరీర్‌లో అడుగులు వేస్తూ కేవలం తమిళ్‌లో మాత్రమే కాకుండా కన్నడం, మలయాళం, తెలుగు సినిమా ఇండస్ట్రీలోనూ వరుస సినిమాలు చేస్తూ వచ్చింది. ఈ మధ్య కాలంలో ఈమె వరుసగా తెలుగు సినిమాలు చేయడంతో టాలీవుడ్‌లో కచ్చితంగా పాపులర్ అయ్యే అవకాశం ఉందని అంతా భావించారు. కానీ తెలుగులో చేసిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశ పరచడం తో మళ్లీ తెలుగు ఆఫర్లు రాలేదు. గత ఏడాది మలయాళ సినిమా బజూకాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ అమ్మడు ఆ తర్వాత చేసిన సినిమాలు ఏమీ లేవు. ఈ ఏడాది ఈమె నుంచి సినిమా వచ్చేది... రానిది ఇంకా క్లారిటీ రాలేదు. టాలీవుడ్‌లో ఈ అమ్మడు కొత్తగా సినిమాలు ఏమీ చేయడం లేదు. అయితే తమిళ, మలయాళంలో మాత్రం సినిమాలు చర్చల దశలో ఉన్నాయి. త్వరలోనే అవి సెట్స్ పైకి వెళ్లే అవకాశాలు ఉన్నాయని సమాచారం అందుతోంది. కన్నడ సినిమా పరిశ్రమలో ఈ అమ్మడు చేసిన రెండు సినిమాలు మంచి గుర్తింపు తెచ్చి పెట్టినా అక్కడ కూడా పెద్దగా ఆఫర్లు రాలేదు. అయితే ముందు ముందు అయినా ఈమె వరుస సినిమా ఆఫర్లు దక్కించుకుంటుంది అనే విశ్వాసం వ్యక్తం అవుతోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో రెగ్యులర్‌గా ఈమె షేర్ చేసే అందమైన ఫోటోల కారణంగా ఆఫర్లు దక్కించుకునే అవకాశాలు బాగానే ఉన్నాయి. తాజాగా ఈమె పొట్టి నిక్కర్ ఫోటోలను షేర్ చేయడం ద్వారా అందరి చూపు తన వైపు తిప్పుకుంది. ఈ అమ్మడి థైస్ అందంతో చూపు తిప్పనివ్వడం లేదు. నడుము అందం చూపిస్తూ కవ్విస్తున్న ఐశ్వర్య మీనన్ అందాల ఆరబోత ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉన్న నేపథ్యంలో ఫాలోవర్స్ పెరుగుతూ వస్తున్నారు. ఈ స్థాయిలో అందంగా ఉన్న ఐశ్వర్య మీనన్ లక్ కలిసి రాకపోవడంతో ఆఫర్లు ఆశించిన స్థాయిలో దక్కడం లేదని అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇండస్ట్రీలో అడుగు పెట్టి దాదాపు దశాబ్ద కాలం అయిన ఈ అమ్మడు ఇంకా బ్రేక్ దక్కలేదని ఫ్యాన్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## `స్పిరిట్` హీరోయిన్ ఆస్తి ఎంతో తెలుసా?

త్రిప్తి దిమ్రీ నేటి జెన్ జెడ్ యూత్ కలల రాణి. యానిమల్ చిత్రంతో నటిగా ఈ బ్యూటీ ప్రతిభ ప్రపంచానికి తెలిసింది. యానిమల్ కంటే బెస్ట్ పెర్ఫామెన్స్ ఇచ్చిన సినిమాలు కెరీర్ లో ఉన్నా, తనకు ఆశించిన గుర్తింపు దక్కలేదని హిందీ మీడియాలు కథనాలు ప్రచురించాయి. అగ్ర కథానాయకుడు రణబీర్ సరసన చిన్న పాత్రతోనే పెద్ద గుర్తింపు తెచ్చుకుంది. ఈ సినిమా తర్వాత బ్యాడ్ న్యూజ్ సహా పలు హిట్ సినిమాల్లో నటించింది త్రిప్తి. బాలీవుడ్ లో రేర్ ట్యాలెంట్ అంటూ ప్రశంసలు అందుకుంటోంది. ప్రభాస్ సరసన `స్పిరిట్` లాంటి భారీ పాన్ ఇండియన్ చిత్రంలో కథానాయికగా ఎంపిక చేసి మరోసారి షాకిచ్చాడు సందీప్ వంగా. ఇది త్రిప్తికి ఊహించని అవకాశం. దీపిక పదుకొనే లాంటి అగ్ర కథానాయిక స్థానంలో త్రిప్తిని ఎంపిక చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. త్రిప్తి తనను తాను నిరూపించుకునేందుకు ఇది సరైన సమయం. ఈ ప్రత్యేక సందర్భంలో త్రిప్తి దిమ్రీ కెరీర్ గ్రాఫ్, ఆదాయం, సంపదల గురించి ఆసక్తికర చర్చ సాగుతోంది. ముఖ్యంగా త్రిప్తి బాంద్రా- ముంబైలో ఇటీవలే ఒక కొత్త అపార్ట్ మెంట్ కొనుగోలు చేసింది. ఈ అపార్ట్ మెంట్ ధర 14 కోట్లు. స్టాంప్ డ్యూటీ కోసం భారీ మొత్తంలో చెల్లించింది. ఈ బంగ్లా గేలాక్సీకి అత్యంత సమీపంలో, షారూఖ్ ఖాన్, రణబీర్ కపూర్ లాంటి అగ్ర కథానాయకుల ఇంటికి సమీపంగా ఉందని కూడా కథనాలొస్తున్నాయి. 2226 చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యంత విలాసవంతమైన అపార్ట్ మెంట్ టాప్ సెలబ్రిటీల నివాసాలకు సమీపంగా ఉంది. ఈ బ్యూటీ ఒక్కో సినిమాకు 4-6 కోట్ల మధ్య పారితోషికం అందుకుంటోంది. యానిమల్ తర్వాత నెట్ ఫ్లిక్స్ సిరీస్ కోసం 80లక్షలు అందుకున్న త్రిప్తి ఇటీవల భారీగా పారితోషికం పెంచేసింది. ఉత్తరాఖండ్ లోని ఒక చిన్న పట్టణంలో జన్మించిన త్రిప్తి ఒక సాధారణ మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చింది. చాలా తక్కువ సమయంలో దాదాపు 30 కోట్ల మేర నికర ఆస్తులను కలిగి ఉందని టైమ్స్ తన కథనంలో పేర్కొంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.